# అభ్యుదయం

జయ



**విద్యార్థినుల కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ**

కాలేజీ వార్షికోత్సవం. మంత్రిగారు వేదికను అలంకరించారు. క్రమంగా అనుకున్న ప్రకారం అన్ని ప్రోగ్రాములు ప్రదర్శించబడ్డాయి. చివరలో జనగణమణ పాడకముందు వరకట్నదురాచారం గురించి, దాన్ని సమూలంగా నాశనం చెయ్యటంలో విద్యార్థినులు వహించాల్సిన పాత్రగురించి మంత్రిగారు దీర్ఘోపన్యాసం యిచ్చారు. ఆ దీర్ఘోపన్యాసంలో వరకట్న దురాచారం లాంటిదే మరొకటి కన్యాశుల్కమని, దాన్ని సమూలంగా నాశనం చెయ్యటానికై కృషిచేసింది జాతిపిత గాంధీ అని పేర్కొన్నారు. కాని ఆ పొరపాటు ఎవరూ పట్టించుకున్నట్టు లేదు. మంత్రిగారి దృష్టిలో ఈ దేశంలో వున్న దురాచారాలన్నిటిని పారద్రోలింది గాంధీ మాత్రమే అని గొప్ప నమ్మకం వుంది. హాలులో గోడకి తగిలించి వున్న ఫోటోలో, వీరేశలింగంగారు వ్యంగ్యంతో కూడిన చిరునవ్వు నవ్వినట్లు అన్పించింది–ఆ వుపన్యాసం వ్రాసిన మంత్రిగారు సెక్రటరీకి. "చూసి కూడా సరిగ్గా చదవలేకపోతే ఎలాగ" అని మంత్రిగారి గురించి మనస్సులో గొణుక్కున్నాడు సెక్రటరీ.

మంత్రిగారి వుపన్యాసం పూర్తయింది. మంత్రిగారు మాట్లాడిన వుపన్యాసం తాలూకు కొన్ని వాక్యాలని కొటేషన్లుగా వాడుతూ, ఆ వాక్యాలని ఎంత చమత్కారంగా మంత్రిగారు సెలవిచ్చారో మంత్రిగారి భక్తులు సోదాహరణంగా వివరించారు. మంత్రిగారు భక్తుల భజన పూర్తయ్యాక ప్రిన్సిపల్ హేమాదేవి లేచి యువతులు మంత్రిగారు చెప్పినట్లు ముందడుగు వెయ్యాలని, అలాచేసే యువతులకి తాను ఎప్పుడూ సాయం చెయ్యటానికి సిద్ధమే అని చెప్పి కాలేజీ కమిటీ ప్రెసిడెంటు కేసి చూసింది. ఆయన ఆమె మాటలను ఓకే చేసినట్టుగా తల వూపాడు. అమ్మయ్య అనుకుంది హేమాదేవి.

తర్వాత చివరలో విద్యార్థినులందరి చేత మూకుమ్మడిగా మేము వరకట్న దురాచారాన్ని వ్యతిరేకిస్తున్నాము. కట్నం తీసుకునే మగవాడ్ని

పెళ్ళి చేసుకోము. అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆడపిల్లలంతా వుద్రేకంతో చాలా సిన్సియర్‌గా ఆ క్షణంలో ఈ ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థినుల చేత ఇటువంటి అభ్యుదయ కరమైన ప్రతిజ్ఞ చేయించినందుకు మంత్రిగారినీ కాలేజీ కమిటీ ప్రెసిడెంటుని ప్రిన్సిపల్ హేమా దేవిని పొగుడుతూ పేపరులో వార్తపడింది.

*

ఇది ప్రతిజ్ఞల దేశం. తండ్రి దగ్గర ప్రతిజ్ఞ చేసి అడవులకి వెళ్ళాడు రాముడు. చెల్లెలి దగ్గర ప్రతిజ్ఞ చేసి కౌరవులని నాశనం చేసాడు కృష్ణుడు. ఆ సంఘటనలు జరిగింది కృతయుగంలో, ద్వాపర యుగంలో. కాని కలియుగంలో ప్రతిజ్ఞ విలువెంత?

సంధ్య, రాధ, సమత కాలేజీ ఆవరణలో వున్న చింతచెట్టు క్రింద కూర్చున్నారు.

"నాకు మీరీ విషయంలో హెల్ప్ చెయ్యాలి. మీ మీదే నేను అన్ని ఆశలు పెట్టుకున్నాను" అంది సంధ్య రాధని సమతని చూస్తూ. సమత, సంధ్య మొహంలో కదలాడిన దీనత్వం చూసి, "డోన్ట్‌వర్రీ ఎబౌట్ దట్" అంటూ సంధ్య చెయ్యి నొక్కింది.

రాధ "విషయం ఏమిటో చెప్పు ముందు" అంది.

"నీకు తెల్సుగా నేను రవీంద్రని ప్రేమించానని. అతన్ని నీకు పరిచయం కూడా చేసాను" అంది సంధ్య.

"అవునవును. మంచి సంస్కారి అన్పించింది చూడగానే" అంది సమత.

"అందగాడు. పైగా ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మీ వాళ్ళు తల తాకట్టు పెట్టినాసరే నీకు అలాంటి అబ్బాయిని తేలేరు." అంది రాధ.

"మా ఇద్దరివీ వేరు వేరు మతాలు. మాఇంట్లో వాళ్ళకి ఈ విషయం తెలిస్తే నా పీక నొక్కి అవతల పడేస్తారు" అంది సంధ్య.

"మరీ అంత క్రూయల్టీయా" ఆశ్చర్య పోయింది సమత.

"అందరూ మీ ఇంట్లో వున్నట్టే అభ్యుదయ వాదులు వుంటారా?" అంది సంధ్య.

"నిజమే తనింట్లో వాళ్ళందరూ ఎడ్యుకేటెడే. ఫార్వర్డ్ థింకింగ్ వున్నవాళ్ళు. సోష లిస్టులు. ఎప్పుడు చూసినా దేశంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాల గురించి, ప్రజల అజ్ఞానం, స్వార్థం గురించి మాట్లాడుతూ వుంటారు. తన వ్యక్తిత్వానికి తన మాటకి తమ ఇంట్లో విలువుంది-అనుకుంది సమత.

"పేరు, పరువు వీటికి విలువ యిస్తారు మా వాళ్ళు. అంతేగాని మనిషికి, మనిషి గుణాలకీ విలువ యివ్వరు. యివ్వటంలేదు." అని కాసేపాగి, నాకు మా వాళ్ళు సంబంధం చూసారు. పదిహేను వేలు కట్నం. అబ్బాయి బికామ్ కంపార్టు మెంట్సులో పాసయ్యాడు. యింకా వుద్యోగం దొరకలేదు." అంది సంధ్య.

"అతన్ని చూశావా?" అంది రాధ.

"చూడటమా ఎందుకు? నా యిష్టాయిష్టాలతో మా యింట్లో ఎవరికీ పనిలేదు. వాళ్ళకి నచ్చాడు. ఆ అబ్బాయికి నా ఫోటో నచ్చిందట. అంతే."

"ఏది నచ్చింది? నీ ఫొటోనా లేక మీ నాన్న యిచ్చే కట్నమా? కాని ఎక్కడ్నించి తెస్తారు పదిహేను వేలు? యిదివరకే మీ నాన్న ఏదో అప్పులు చేశారన్నావు" అనడిగింది సమత ప్రశ్నార్థకంగా.

"అప్పులు చేయటం, వున్నవి తాకట్టు పెట్టుకోవటం మధ్యతరగతి గుమాస్తా జీవితంలో తప్పని దౌర్భాగ్యాలు. యిప్పుడు నా పెళ్ళికోసం మాకున్న అరఎకరం, అమ్మ ఒంటి మీదున్న కొద్దిపాటి నగలు అమ్మదామనుకుంటున్నారు."

"యింకా మీ తమ్ముళ్ళు, చెల్లెలు వున్నారు. వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు....?" అంది ప్రశ్నార్ధకంగా సమత.

"నారు పోసినవాడు నీరు పొయ్యడా? యిది వాళ్ళ సిద్ధాంతం. రేపటి సంగతి ఆ కృష్ణ పరమాత్ముడే చూస్తాడు. యిది వాళ్ళ ఆలోచనా ధోరణి" నిట్టూరుస్తూ అంది సంధ్య.

"యింతకీ అసలు విషయం?" అడిగింది

## మెదడుకి మేత

మీ మెదడుకు పదునుపెట్టే మూడు సమస్యలు ఇక్కడ ఇస్తున్నాము. వాటికి సమాధానాలు కనుక్కోగలరేమో ప్రయత్నించి చూడండి.

1. కూతురి వయస్సు: నేను శ్రీమతి సులేఖని అడిగాను మీ కూతురి వయసు ఎంతండీ అని. దానికి ఆవిడ ఇచ్చిన సమాధానం ఇది. 'నా వయస్సులోని అంకెలకి తారుమారు మా కూతురి వయస్సులోని అంకెలు. కాని 5 సంవత్సరముల తర్వాత తన వయస్సు నా వయస్సులో సగం: బీజగణితమును ఉపయోగించకుండా శ్రీమతి సులేఖ కూతురి వయస్సు కనుగొనగలరా?

2. వివాహ సంవత్సరము: నేను మా పిన్నిని అడిగాను 'పిన్నీ మీ పెండ్లి ఎప్పుడయింది' అని. దానికి ఆవిడ ఇచ్చిన సమాధానం – నా వివాహ సంవత్సరమును తలక్రిందులు చేసినా అదే వస్తుంది. (ఆవిడ పెండ్లి అయినది 20వ శతాబ్దములోనే) ఆవిడ వివాహ సంవత్సరం కనుగొనగలరా?

3. ఫోను నంబరు, వయస్సు: ప్రమీలని ఒక ఇంటర్వ్యూలో వయస్సు అడిగారు. కాని తనకి చెప్పడం ఇష్టంలేదు కాబట్టి ఇలా చెప్పింది. 'నా వయస్సు 4 చే భాగింపబడును. మా ఫోను నంబరులోని సంఖ్యల మొత్తం నా వయస్సుకి సమానం. మా ఫోను నంబరు పాలిన్‌డ్రోమిక్ (అంటే ఎడమనుంచి కుడి, కుడినుంచి ఎడమకు వ్రాసినా ఒకే సంఖ్య వస్తుంది) మా ఫోను నంబరు 11 చే భాగింపబడును! ఇంటర్వ్యూ చేసే వ్యక్తులలో ఒకతను ఈ సమాచారం చాలదు మీ వయస్సు కనుక్కోవటానికి అన్నారు దానికి ఆమె 'మా ఫోన్ నంబరులోని మధ్య సంఖ్య మిగిలిన సంఖ్యల మొత్తమునకు సమానం. అందులో ఏ సంఖ్య బేసికాదు! అని చెప్పింది. మీరు ఆవిడ వయస్సు, ఫోను నంబరు కనుగొనగలరా?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి.]

రాధ.

"రవి రూర్కెలా నుంచి ఏప్రిల్ లాస్ట్ వీక్‌లో వచ్చి నన్ను తీసుకువెళ్ళి పెళ్ళి చేసుకుంటానని వ్రాశాడు. కాని వీళ్ళు ఏప్రిల్ యిరవై రెండున నా పెళ్ళి ముహూర్తం పెట్టారు. కాబట్టి మా వాళ్ళకి తెలీకుండా మీలో ఒకరు నన్ను మీ యింట్లో వుంచుకోవాలి రవి వచ్చేంతవరకు."

"మా ఇంట్లో వుండు" అంది సమత వెంటనే.

రాధ "అదే మంచిది. నువ్వు వాళ్ళింట్లో వుండు సంధ్యా. ఈ రహస్యం బయటకి వచ్చిందా యిక అంతే, ఎంత దారుణం జరగాలో అంతా జరుగుతుంది" అని సమతకేసి చూస్తూ.

"నువ్వే జాగ్రత్తగా వుండాలి సమతా. ఎవరికీ చెప్పకూడదు ఆఖరికి మీ యింట్లో పెద్దవాళ్ళకి కూడా చెప్పకూడదు" అంది.

*

సృష్టిలో తీయనిది స్నేహం అన్నారు. కాని ఎదుట స్నేహసుధలు కురిపిస్తూ మాట్లాడుతూ క్రింద గోతులు తవ్వే స్నేహితులు ఎక్కువవుతున్న ఈ కాలంలో నిజమైన స్నేహితులెవరో తెల్సుకో గలిగితే?

*

"నా స్నేహితురాలమ్మా. ఎగ్జామ్స్ దగ్గరికి వచ్చాయిగా. అందుకని కల్సి చదువుకోవచ్చని తీసుకువచ్చాను. అదీగాక ఆ అమ్మాయి అమ్మా, నాన్న వూళ్ళో లేరు. ఏదో పెళ్ళికి గుంటూరు వెళ్ళారట" అంది సమత సంధ్యని పరిచయం చేస్తూ వాళ్ళమ్మగారితో, ఆవిడ మనస్సులో విసుక్కున్నా సంధ్యని ఆదరంగానే ఆహ్వానించారు.

సంధ్య వ్రాసిన వుత్తరం చూసుకుని యింట్లో వాళ్ళు గొల్లుమన్నారు. తండ్రి పళ్ళు నూరాడు. తల్లి నోట్లో చీరచెంగు కుక్కుకుంది. చుట్టుపక్కలవాళ్లు "ఫలానావారమ్మాయి లేచిపోయిందట" అని చెవులు కొరుక్కున్నారు.

"అదెక్కడ వున్నా జుట్టుపట్టుకుని తీసుకు వస్తాను" అని కోపంతో సంధ్య తండ్రి కాలేజీ కమిటీ ప్రెసిడెంటుని కలిశాడు. ప్రెసిడెంటుగారు తమ కులం అమ్మాయి మరో కులం అబ్బాయితో లేచిపోయిందని తెల్సి మండిపోయారు. తరతరాల నుంచి రక్షించుకుంటూ వచ్చిన కులం పరువు, కాలేజీ పేరు పాడయి పోయాయని తెల్సి అగ్గిలో గుగ్గిలంలా వేడెక్కిపోయారు. ఆ వేడి వార్నింగ్ రూపంలో హేమాదేవికి చేరింది. ఆవిడ సమతని పిల్చి సంధ్య గురించిన యిన్ఫర్మేషను లాగటానికి ప్రయత్నించి విఫలురాలయ్యింది.

మరసటి రోజు బెస్ట్ స్టూడెంటు అవార్డు ఆ సంవత్సరం రాధకి యిస్తున్నారనే వార్త, సమత కాలేజీ నుంచి పది రోజులు సస్పెండు అయిందనే వార్త నోటీసుబోర్డులోకి ఎక్కాయి.

సంధ్య, ఆమె యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా బలిపశువులా లాక్కువెళ్ళబడింది. సమత టెలిగ్రాము అందుకుని వూర్లో అడుగుపెట్టిన రవీంద్రకు బుర్రపగిలి హాస్పటల్ పాలయ్యాడు.

*

అమ్మాయి హృదయం పగిలింది.

అబ్బాయి బుర్ర పగిలింది.

మధ్యతరగతి గుమస్తా యింటి పరువు నిలబడ గలిగింది.

*

సమతని పది రోజులపాటు కాలేజీ నుంచి సస్పెండు చేసినట్టు యింట్లో అందరికీ తెల్సింది.

మనిషిలో దయా, జాలి వుండాలనే మానవతా ధర్మాలు పలికే తల్లి—

"ఛీఛీ యిది యిలాంటి బుద్ధితక్కువ పనులు చేస్తుందనుకోలేదు. అవిగో అస్తమానం ఆ చచ్చు పుస్తకాలు, విప్లవ ఆశయాలు చదివి యిలా తయారయ్యింది. ఈ విషయం అందరికీ తెలుస్తుంది. రేపు వాళ్ళడిగే ప్రశ్నలకి జవాబు ఏం చెప్పుకోగలం" అని కోపం, చిరాకు వ్యక్త పరిచింది. సంఘంలో న్యాయాన్ని స్థాపించటానికి కంకణం కట్టుకున్నాననే లాయరైన తండ్రి—

"నువ్వు చేసిన పని బాగాలేదమ్మాయ్. వాళ్ళ గొడవ ఏదో వాళ్ళు పడతారు. నువ్వెందుకు ఆ అమ్మాయిని యింట్లో పెట్టుకోడానికి ఒప్పుకున్నావ్" మందలింపుగా అన్నారు.

మగవాడితో స్త్రీకి సమాన హక్కులు వుండాలని వాదించే అన్న — "మేమూ అభ్యుదయ వాదులమే కాని నీకులాగ ఏనాడూ వేలెత్తి చూపించుకోలేదు. నీకంతగా సంఘసేవ చెయ్యాలనుంటే మహిళా మండలిలో సభ్యురాలిగా చేరు. నిజమైన స్త్రీ సమస్యల గురించి నీకు తెలుస్తుంది."

సాంఘిక దురన్యాయాలని అరికట్టటానికే పుట్టాననే తమ్ముడు—

"ఒక అమ్మాయి లేచిపోవటానికి మీ అక్క సాయం చేసిందట కదురా; సస్పెండ్ చేసారట అంటూ నా ముందే మా ఫ్రెండ్సు ఎగతాళిగా అడుగుతున్నారు." అన్నాడు అక్కకేసి కసిగా చూస్తూ.

లోక కళ్యాణార్థం జర్నలిస్టుగా మారాలనన్న అన్న "మీ ఫ్రెండ్ ఆ అబ్బాయిని బాగా ప్రేమించిందా?" అన్నాడు చెల్లెల్ని వుద్దేశించి.

"ఆ"

"వేరే పెళ్ళిచేస్తారా ఆమె పెద్దవాళ్ళు?"

"ఆ"

"ఎవర్ని?"

"ఎవడినో ఒకడిని. యిప్పుడు కుదిరిన సంబంధం తప్పిపోతే నడ్డి వంగిపోయిన గుమస్తానో లేకపోతే రెండో పెళ్ళికోసం తహతహలాడే నలుగురి పిల్లల తండ్రినో ఎవడినో ఒకడిని తెచ్చి చేసారు."

Seeta Rama Sastry (Retd)
WRITER
RAMAKRISHNA NAGAR
No. 24
SRIKAKULAM

"మీ ఫ్రెండ్ పెళ్ళి చేసుకుంటుందా?"

"బలవంతంగా మెడవంచి మంగళ సూత్రం కట్టిస్తుంటే ఏం చేస్తుంది."

"ఆత్మహత్య మాత్రం చేసుకోదుగదా?"

అంతవరకు సమతలో ఆ ఆలోచన రాలేదు. అందుకే కరంట్ షాక్ తగిలినట్టు వుండిపోయింది. తర్వాత మెల్లిగా "ఏం?" అంది.

"ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటే అది న్యూస్ పేపరులో హెడ్‌లైన్స్‌ని హిట్ చేసేటంత వార్తవుతుంది. నేను ఆ అమ్మాయి ఫొటోలు అవీ సంపాదించి సంఘపు దురన్యాయానికి బలయిన అబల అని హెడ్డింగ్ పెట్టి ఆర్టికల్ వ్రాసి ఏ పత్రికకో పంపిస్తే నాకు మంచి పేరు వస్తుంది. నలుగురూ నన్ను...." యింకా ఏదో చెబుతున్నాడు.

సమత చెవులు మాత్రం ఆ విషయాన్ని వినడం లేదు. తనవాళ్ళ గురించి ఆమెలో యిప్పటివరకు వున్న గొప్ప అభిప్రాయాలు కరిగిపోతున్నాయి మైనంలా. పైన షుగర్ కోటింగ్ కొట్టుకున్న చేదు బిళ్ళల్లా ప్రత్యక్షమవుతున్నారు అందరూ.

*

ఏవో గొప్ప భావాలతో, ఆశయాలతో ముందుకు పయనిద్దామనే ఆలోచన పక్కకు నెట్టి మాటల వరకు సరిపెట్టుకుని చేతలవరకు వెళ్ళకుండా వుంటే—అదే అభ్యుదయం!